# కసాయి తల్లి

ఆఖరికి నువ్వూ అన్నావ్....నిజమే....కసాయి తల్లీ....ఆ మాట వాళ్ళూ వీళ్లూ అనటం అశ్చర్యం కాదు. అధిక ప్రసంగం అనిపించదు. భూమి ఆకాశం దద్దరిల్లేట్టు నాన్న కేకవేసినా శాంతగోదారిలా ఎప్పుడూ పౌరుషంగా ఒక్కమాటైనా ఎదురు మాట్లాడని అమ్మ ఆ మాట అంది. ఉహూ... అమ్మలు అమృతసంద్రాలు కదా....మరి ఈ కసాయితనం ఎక్కడ నుంచి వచ్చిందంటావ్?!......

పక్కలో పసికందు ఆకలి రాగం ఆలోచనలని అడ్డుకొన్నాయి. పక్కకి తిరిగి పాపని గుండెల దగ్గరికి తీసుకున్నాను. నిన్నటివరకూ లోకం తెలియని ఈ చిన్నది ఈ రోజు జీవితానికే ఓ పెద్ద ప్రశ్నార్థకంగా నిలిచింది. జవాబుదారీని కాగలనా?!

నిన్న రాత్రి పుట్టింది. తెల్లారే వరకు నాకు మగత. నీరసం. శరీరకమో, మానసికమో తెలియని బాధ. ఈ తెల్లారేగా ఈ పిల్ల ఆలోచనలని ఆక్రమించేసింది.

'దుర్గా! పాపకి పాలు ఇవ్వొద్దు. బయటపాలే పడదాం. రెండ్రోజుల కోసం నీ పాలు అలవాటు చేయడం ఎందుకు' అంది అమ్మ.

కళ్ళెత్తి అమ్మ వేపు చూశాను.

నీళ్ళు నిండిన కళ్ళతో అమ్మ బయటికి వెళ్ళిపోయింది.

పక్క మంచంపై ఇల్లాలికి కవలపిల్లలు పుట్టారంట. కోలాహలం... తీయని పదార్థాల పంపకపు సంబరం....

నాన్న తెలిసిన పిల్లల పుట్టుక పెద్ద పండుగే కదా... ఈ పిల్ల నాన్న ఎవరో.....

ఆరోజు ఎప్పటిలానే అమ్మవారి హారతి కళ్ళకి అద్దుకుని ప్రసాదం కాస్త నోట్లో వేసుకుని, వంట్లో బాగులేక గుడికి రాకుండా ఇంట్లో వుండిపోయిన చెల్లికోసం మిగిలిన ప్రసాదం, కాస్త కుంకుమ తీసుకుని ఇంటికి వెళుతున్నాను. పద్మాపురం గార్డెన్స్ దాటి కాస్త దూరం వెళ్ళానో లేదో ఎవరో తుప్పల్లోకి లాగేరు.

ఊర్లో వాళ్లో....ఊరి బయటవాళ్ళో...షూటింగ్స్ కోసం వచ్చిన వాళ్ళో, పిక్నిక్‌కి వచ్చిన కుర్రాళ్ళో, ఎవరో ఏమిటో-జరగాల్సిన అఘాయిత్యం జరిగిపోయింది. నరనరాల్లో బాధ. భయం. తిరిగి ఇంటికి ఎలా వెళ్ళానో! అవమానాన్ని బహిరంగంగా వ్యక్తపర్చలేని భయం.

అక్కకి మూడో పురుడు పోయడానికి అమ్మ అనకాపల్లి వెళ్ళింది.

గుండెమంటని కళ్ళలో, కళ్ళ నీళ్ళు దిండులో రాత్రులకి రాత్రులు ఇంకిపోయాయి. ఈ దిక్కుతోచని స్థితిలో పట్టించుకోని నా ఆలోచనలకే రాని విషయం ఆరోగ్యం....అక్కకి పురుడుపోసి, బారసాల చేసి పదిరోజులు అక్కకి తోడుండి వచ్చిన అమ్మకి ఇంట్లో పెళ్ళికాని తన రెండవ కూతురు నెలతప్పిందని తెలిసి సర్వశక్తులు కూడదీసుకుని నాన్నకి ఈ విషయం చెప్పిన రోజు నాన్న పెద్దరికం.....నిస్సహాయంగా, నిశ్శబ్దంగా కళ్ళనీళ్ళు నింపుకొంటుంటే అప్పుడు ఏడ్చాను బహిరంగంగా.

ఉన్నఊళ్ళో నాటుపద్ధతిలోనో నాగరిక పద్ధతిలోనో గర్భం తీయించేసుకోడానికి పరువు భయం.

పక్కనున్న విశాఖ వెళదామంటే పొరపాటున తెలిసిన వాళ్ళు

కనిపిస్తారనే అనుమానం....రాజధానికి వచ్చి హాస్పిటల్‌కి వెళితే 'ఐదో నెల వచ్చేస్తుంటే ఇప్పుడేం అబార్షన్, పెద్ద ప్రాణానికే గండం' అన్నారు. పెద్దప్రాణం రక్షించుకోడానికి చిన్న ప్రాణాన్ని బలిచేయడానికి నిర్ణయం జరిగిపోయింది.

యాత్ర....తీర్థయాత్ర...చదువు...ట్రైనింగ్-కలగాపులగపు కారణాలు. రాజధానిలో రహస్య జీవితం.

పెళ్ళికని కూడబెట్టిన డబ్బు అవివాహిత పురిటి ఖర్చుకి పనికొచ్చింది. పుట్టిన పిల్లని ఏం చెయ్యాలని ఎవరికి తోచిన ఆలోచనలు లోలోపలే చేస్తున్నాం. అనాథా శ్రయంలో వదిలేద్దాం....

ట్రైన్ కంపార్ట్‌మెంట్‌లో వదిలేద్దాం...ఒక్క ఆలోచనా...ఒక్కనాటి ఆలోచనా.... నిముషాలు....గంటలు....రోజులు ఇవే ఆలోచనలు.

పాప పుట్టక ముందు చేసిన ఆలోచనలన్నీ పాపని సజీవంగా చూసేసరికి చెల్లాచెదురయ్యాయి. అమ్మా నాన్న ఏం చెయ్యాలో తెలియని దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

మాతృత్వం అంటే ఏమిటో తెలిసి అసలు నా మనస్థితిని ఏమనాలో తెలియని అయోమయావస్థ.

పద్నాలుగేళ్ళ వయస్సులో పెంచుకోవాలనే సరదా. రెండు పావురాలని పట్టుకొచ్చి వాటికి గింజలు వేసి, నీళ్లు పెట్టి, పిల్లి ఎత్తుకు పోకుండా రాత్రిపూట వాటిని పక్కనే వుంచి కోళ్ళగంప బోర్లించి నిద్రపోవడం....కాస్త అలవాటయ్యాక వాటిని బయటికి వదిలితే రెండు రోజులు తిరిగొచ్చిన ఆ పావురాలు. మూడో రోజున ఒక్కటే తిరిగి వచ్చింది. కానీ రెండో పావురం కోసం వెతికి వెతికి అలుపొచ్చింది. పావురంపై బెంగ.

'ఎవరైనా మాంసం కోసం పట్టుకున్నారేమో' అని పాలబ్బాయి అంటే వెక్కెక్కి పావురం కోసం ఏడ్చాను.

మర్నాడు రెండో పావురమూ రాలేదు. ఏమైపోయాయో తెలియని పావురాలకోసం ఎంత దిగులు పడ్డానో. దగ్గరలోనే మరొకరు పెంచు కుంటున్న పావురాల గుంపులో ఇవి వున్నాయని నిర్ధారించుకున్న రోజు పోనీలే ఎక్కడో అక్కడ వున్నాయి కదాని సంతోషించాను.

పావురాలు ఎగిరిపోతేనే ఇంత క్షోభపడ్డానే ఈ చిన్ని పాపాయిని వదిలేసి నిశ్చింతగా ఉండగలనా....

ఈ రోజు ఉదయం హాస్పిటల్ పక్కనే చెత్తకుండీలో వదిలేసిన ఓ పసికందుని కుక్కలు పీక్కుతినే దృశ్యం చూసిన అమ్మ ఎంతగా కదిలిపోయిందంటే ఒకటి రెండు రోజుల్లో ఏదో ఒక క్షణాన్న ఏదో ఒక విధంగా ఈ పిల్లని మేం వదిలించుకోబోతున్నామనే విషయం మర్చిపోయింది... అందరితోబాటు ఆ తల్లిని 'కసాయితల్లీ' అనేసింది.

పాపని వదిలైటానికి మనసొప్పటం లేదు.

ఏమవుతుంది పెంచితే....

కన్నబిడ్డని చెబితే ఏమవుతుంది.

ఏం కాదు మర్యాద పోతుంది. అద్దెకి పోర్షన్ దొరకదు. ఎదురింటి వాడికి పక్కింటి వాడికి లోకువైపోతాం. ప్రతిక్షణం మాటల చూపుల బులెట్లకి శరీరాన్ని మనసుని అప్పచెప్పేయాలి. చెల్లాయికి పెళ్ళవ్వదు. అత్తగారింట అక్కకి మనశ్శాంతి వుండదు. అవివాహితగా బతకడానికే దారిలేని సమాజంలో అవివాహిత తల్లిగా బతకడం అంటే పద్మవ్యూహంలోకి చొచ్చుకుపోవడమేగా.

ఎందుకింత యోచన.

వదిలేస్తే....కడవరకు మనసంతా రావణాకాష్టమేగా.

'లే. అన్నం తిను' అంది అమ్మ.

"నాన్న ఏరమ్మా" అడిగాను మంచం మీద నుంచి లేచి కూర్చుంటూ.

"స్టేషన్‌కి వెళ్ళారమ్మా. రేపు సాయంత్రానికి రిజర్వేషన్ చేయడానికి" అంది అమ్మ.

అన్నంలో బీరకాయకూర కలుపుతూ "అమ్మా!పాపని వదిలెయ్యాలా" అడిగాను.

జవాబు చెప్పలేనట్టు అమ్మ చీరచెంగుతో కళ్ళొత్తుకుంది.

ఇన్నాళ్ళుగా నాలో లేని ఆలోచనలు పాపని చూసినప్పటి నుంచి వస్తున్నాయి.

"ఉదయం మీరంతా ఆ తల్లిని అనాలోచితంగా కసాయి అనేసారు. కానీ ఆ బిడ్డని విడిచిపెట్టడానికి ఆ తల్లి హృదయం ఎన్ని ముక్కలై వుంటుందో! తల్లులు అంటే పెళ్ళి అయిన వాళ్ళే కాదని అవివాహిత తల్లులుంటారని, వాళ్ళని గుర్తించాలని, వాళ్ళకి ప్రత్యేకమైన సదుపాయాలు అందించాలని ప్రభుత్వం శాసనాలు చెయ్యాలి. చట్టాలు తీసుకురావాలి. పెళ్ళి కాకుండా తల్లికావడం తప్పుకాదని ప్రచారం చెయ్యాలి. అప్పుడు అవివాహిత తల్లులు తలెత్తుకుని బతుకుతారు. సిగ్గుపడరు. భయపడరు. అన్ని కొత్తతనాలని మెల్లగా జీర్ణించుకునే వారంతా ఇలాంటి తల్లుల్ని, పిల్లల్ని వెలివేయరు. సమాజం నుంచీ, ప్రభుత్వాల నుంచీ ఏ విధమైన సపోర్టు లేక పైగా అసహ్యతని భరించాల్సి రావటంతో తల్లుల మనసులు మండి పోతున్నాయి. పిల్లల బాల్యం మురికి కాల్వల్లో పొంగిపొరలదుగా... చెత్తకుండీలలో నిండిపోదుగా. ఈనాడు నాకువున్న ఈ కాస్త ధైర్యం ఆ అఘాయిత్యం జరిగిన రోజే వుంటే ఈ విషయాన్ని దాచేదాన్నే కాదు. నేను పాపని వదిలెయ్యటం లేదు" చెప్పాను.

"నీకేమైనా మతి పోయిందా" అడిగింది అమ్మ.

"అమ్మా! నా బాధ అర్థం చేసుకో" అన్నాను.

"నాకు తెలుసు ఎంత కష్టమో! కాని నువ్వు ఈ సమాజాన్ని ఎదుర్కోగలవా! పెంచుతావనుకో. ఈ పాప భవిష్యత్తేంటీ" అంది అమ్మ.

చెత్తకుండీ......కుక్కలు....చినిగిన ఇస్తరాకులు చాచే చేతులకంటే మంచి భవిష్యత్తు ఇవ్వలేనా.....

నాన్న రాగానే అమ్మ విషయం చెప్పింది.

"ఏంటీ...చాలు చాలు...ఇప్పటికే బతుకు ఏ క్షణాన బజారు పాలవుతుందోనని క్షణక్షణం ఛస్తున్నాను. ఇప్పుడు తీరిగ్గా పిల్లని పెంచుతావా? నేనో అనాథ శరణాలయం చూసొచ్చాను. ఎవ్వరూ చూడకుండా అక్కడ వదిలేద్దాం" పక్క మంచాల వాళ్ళకి వినిపించకుండా తీవ్రమైన స్వరంతో అన్నాడు.

"పాపని విడిచి రాను"

"విడవక ఇద్దరూ కలిసి ఏ గంగలోనైనా దూకుదాం అను

కుంటున్నారా" కోపంగా అరిచాడు.

"ఏంటామాటలు. పక్క వాళ్ళు వినగలరు" అంది అమ్మ.

"ఏంటి మీ ఇద్దరి గోల. నేనూ మనిషినే. పిల్లని వదిలెయ్యటానికి నేనేం రాక్షసుడిని కాను. అనుభవంతో చెపుతున్నాను. నిన్ను ఈ సమాజం బతకనివ్వదు. సమాజపు గిరిగీతలని చెరిపెయ్యాలనుకున్నవాళ్ళే తిరిగి ఏం చెయ్యలేక అదే గీతలో బతుకుతున్నారు" చికాకుపడ్డాడు నాన్న.

"పాపని పెంచటం తేలికనే అభిప్రాయం నాకేం లేదు నాన్నా. అయినా పాపని విడిచిపెట్టను. ఇక్కడే ఏదో ఒకవిధంగా బతుకుతాను" అన్నాను.

"ఇక్కడా...ఒంటరిగానా...దుర్గా! ఇప్పటికి జరిగిన అఘాయిత్యాలు చాలు. ఇక్కడ నిన్ను వదిలి మేం అక్కడ నిశ్చింతగా ఉండలేమమ్మా" కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అన్నాడు నాన్న.

"ఏం నాన్నా! పందొమ్మిదేళ్ళ ప్రాణిని విడిచి మీరుండటానికి నేనేమైపోతాననో, ఎలా బతుకుతాననో అని ఇంతలా తల్లడిల్లిపోతున్నారే. మూడు దినాల పసికందుని విడిచి నేనెలా నిశ్చింతగా ఉంటాను. పాపని విడిచిపెట్టేది లేదు. ఇక్కడ ఎలా జీవనోపాధి కల్పించుకుని నేను బతకాలో మనం ఆలోచిద్దాం" స్థిరంగా చెప్పేసాను.

కేర్‌మంటున్న పాపాయిని చేతుల్లోకి తీసుకుంటూ "ఆకలేస్తున్నట్టుంది, పాలు ఇవ్వు" అంటూ అమ్మ పాపని నాకు అందించింది.

